ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 16 నవంబరు 2025




సిరిసిల్ల కేడీసీసీ బ్యాంక్

# సహకారం ఎప్పుడో..?

### జిల్లాలో పెరుగనున్న పరపతి సంఘాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2023 సంవత్సరం మేలో కేంద్ర మంత్రి మండలి నిర్ణయం మేరకైనా అన్నదాతలకు పరపతి సంఘాలు పెరుగుతాయని భావించినా ప్రతిపాదనలో ఆగిపోయాయి. జిల్లాలో ప్రస్తుతం 24 సహకార సంఘాలు ఉండగా, 74728 మంది సభ్యులు ఉన్నారు. ఓటు హక్కు కలిగిన వారు 35776 మంది ఉన్నారు. గత ప్రభుత్వం మండలానికి రెండు సంఘాలు ఉండే విధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

దీని ప్రకారం జిల్లాలో 13 మండలాలు ఉండగా 24 సహకార సంఘాలు ఉన్నాయి. సహకార సంఘాల బలోపేతం చేసే దిశగా వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పునర్విభజన చేయాలని, ప్రతి మండలానికి రెండు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా ఎన్నికల కోడ్ రావడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఆ తరువాత వచ్చిన ఆదేశాల మేరకు కసరత్తు చేసినా పనులు నిలిచిపోయాయి.

జిల్లాలో ప్రస్తుతం ఉన్న 24 సహకార సంఘాలకు తోడుగా కొత్తగా మరో 6 సంఘాలు పెరగనున్నాయి. మొదటగా పది సంఘాల పెరుగుదలకు ప్రతి పాదనలు పంపించారు. వాటిలో 6 సంఘాలు పెంచే దిశగా ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో ఇల్లంతకుంట మండలంలో కంది కట్కూర్, పెద్దలింగాపూర్, వేములవాడ మండలం చెక్కపల్లి, వీర్నపల్లి, రుద్రంగి, గంభీ రావుపేట మండలంలో ఒకటి ఏర్పాటు కానున్నాయి. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు సహకార సంఘాల బలోపేతం నిర్ణయాలు జరుగుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సహకార రంగంలో విస్తృతంగా సేవలందిస్తున్న వ్యవసాయ సహకార పరపతి సంఘాలు విస్తరణకు నిరీక్షించే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను విభజించడంతో కొత్తగా మూడు జిల్లాలు ఏర్పడ్డాయి. కొత్త జిల్లాల్లో ఇప్పటివరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను ఏర్పాటు చేయలేదు. దీనికి తోడుగా దాదాపు ఐదు సంవత్సరాల క్రితమే కొత్తగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రతిపాదనలు కోరినా పెండింగ్‌లోనే ఉన్నాయి.

2019లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 6 వ్యవసాయ ప్రాథమిక కేంద్రాలను ఏర్పాటు చేయడానికి పంపిన ప్రతిపాదనలు ఈ ప్రభుత్వంలోనైనా మోక్షం లభిస్తుందనే ఆశలు ఉన్నా వరుస ఎన్నికలతో పరపతి పెరిగే అవకాశాలు దూరంగానే కనిపిస్తున్నాయి. గత సంవత్సరం మేలో కేంద్ర మంత్రి మండలి దేశంలో వచ్చే ఐదేండ్లలో 2 లక్షల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. గ్రామానికో సంఘాన్ని ఏర్పాటు చేసి రైతులకు 25 రకాల సేవలు అందించాలని నిర్ణయించారు.

### వ్యాపార రంగాల్లోకి సహకార సంఘాలు

వ్యవసాయ సహకార పరపతి సంఘాల బలోపేతం వైపు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సహకార రంగంలో వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంది. సహకార పరపతి సంఘాలను

- ఐదేళ్లుగా సింగిల్‌విండో ప్రతిపాదనలు పెండింగ్
- కొత్తగా 6 సింగిల్‌విండోల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- బిజినెస్ దిశగా ఆరు సహకార సంఘాల్లో మార్పులు
- జిల్లాలో 24 సహకార సంఘాలు

పునర్విభజన చేసే కార్యక్రమాలు జరుగుతుండగానే వ్యాపార రంగాల్లోకి తీసుకవచ్చే దిశగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్చుతుంది. ప్రస్తుతం సహకార సంఘాల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయాలతో పాటు ధాన్యం కొనుగోళ్లతో లాభాలు ఆర్జిస్తున్నాయి.

వీటి స్థానంలోనే రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా ఏర్పాటు చేసి ఇతర వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే దిశగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో 311 వ్యవసాయ సహకార పరపతి సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్పులు చేసింది. దీని ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి తేవడం, ఇతర రంగాల్లోనూ అడుగుపెట్టే దిశగా ముందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో 24 వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో తొలి విడతగా ఆరు సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్పులు చేసింది.

జిల్లాలో వేములవాడ, సనుగుల, నాంపల్లి, అల్మాస్‌పూర్, గంబీరావుపేట, ఇల్లంతకుంట సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా మార్పులు చేసి సేవలు అందించనున్నారు. ఈ సంస్థల్లో వాటాదారులుగా చేర్చుకుంటారు. సభ్యులు తమ వాటాకు అనుగుణంగా ఈక్విటీగా కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. ఈ సొసైటీలకు ఈక్విటీ వాటాగా కేంద్ర ప్రభుత్వం రూ 15 లక్షల వరకు ఒక్కో సొసైటీకి మ్యాచింగ్ గ్రాంట్ కింద అందిస్తుంది. మూడు సంవత్సరాల నిర్వహణకు

మిగతా 8లో..

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అత్యాశకు పోయి వ్యక్తిగత, బ్యాంకింగ్ సమాచారం అందించి సైబర్‌నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేష్ బీ గీతే కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణలో ప్రజలు సహకారం అత్యంత కీలకమని, ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదులు చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 64 సైబర్ కేసులను నమోదు చేసి రూ.54లక్షల 97వేల 683 రికవరీ చేశామన్నారు. డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్‌నేరాగాళ్లు కూడా కొత్త కొత్త రూపాల్లో ప్రజలను మోసగిస్తున్నారని, వారి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండడమే ప్రధాన ఆయుధమన్నారు. ఫోన్‌కాల్స్ సోషల్ మీడియా, బ్యాంకింగ్ యాప్స్, డిజిటల్ అరెస్ట్, ఫేక్‌లింకులు, లక్కీడ్రాలు, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లు వంటి అనేక మార్గాల్లో మోసగాళ్లు ప్రజల డేటా డబ్బులు ఎత్తుకుపోవడానికి ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో సైబర్ నేరాలు అరికట్టడంలో సైబర్‌క్రైం టీం, సైబర్ వారియర్లు పకడ్బందీగా వ్యవహరిస్తూ వచ్చిన ప్రతి ఫిర్యాదు వెంటనే నమోదు చేసి విచారణ ప్రారంభించారన్నారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా గడిచిన సంవత్సరంలో జిల్లాలో 64 కేసులను నమోదుచేసి వచ్చిన సైబర్ ఫిర్యాదుల్లో వెంటనే స్పందించి రూ.36లక్షల 29వేల853 ఫ్రీజ్ చేయడంతోపాటు బాధితులు కోల్పోయిన రూ 54లక్షల 97వేల 683 రికవరీ చేసి పోగొట్టుకున్నవారికి డబ్బులను సైతం ఇచ్చామని తెలిపారు. సైబర్‌క్రైమ్ టీమ్, సైబర్ వారియర్‌లు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, బ్యాంక్‌లను సందర్శిస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అనవసరమైన కాల్స్‌తో పాటు తెలియని లింకులను నమ్మవద్దన్నారు. బ్యాంక్ ఓటీపీ, పిన్, సీవీవీ ఎవరికి చెప్పవద్దన్నారు. రుణయాప్స్, ఇన్వెస్ట్‌మెంట్ స్కీం పేరుతో వచ్చే సందేహాలను ఆఫర్లను ప్రజలు నమ్మవద్దని, సైబర్ నేరాలకు గురైతే ఫిర్యాదు చేయాలని ఎస్పీ కోరారు.

## రుద్రంగిలో చలి 9.0 డిగ్రీలు

సిరిసిల్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. శనివారం జిల్లాలో సగటు ఉష్ణోగ్రతలో కనిష్ఠ ఉష్ణోగ్రత 9.0 డిగ్రీలు ఉండగా గరిష్ఠ ఉష్ణోగ్రత 32.0 డిగ్రీలుగా నమోదయింది. రుద్రంగిలో అత్యల్ప ఉష్ణోగ్రత 9.0డిగ్రీలుగా నమోదయింది. గంబీరావుపేటలో 9.7డిగ్రీలు, చందుర్తిలో 10.5డిగ్రీలు, తంగళ్ళపల్లిలో 10.6డిగ్రీలు, వేములవాడ రూరల్‌లో 10.9 డిగ్రీలు, బోయిన్‌పల్లిలో 11.2డిగ్రీలు, వీర్నపల్లిలో 11.2 డిగ్రీలు, కోనరావుపేటలో 11.4 డిగ్రీలు, ఇల్లంతకుంటలో 11.7డిగ్రీలు, వేములవాడలో12.1 డిగ్రీలు, సిరిసిల్లలో 12.1 డిగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో12.4, ముస్తాబాద్‌లో 12.6 డిగ్రీలు, ఉష్ణోగ్రతలు నమోదయింది. చలి తీవ్రతకు సాయంత్రం 6 గంటలకు ప్రజలు ఇళ్లలోకి చేరుకుంటున్నారు.

## ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

**- నివాళులు అర్పించిన ఇన్‌చార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్**


నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తదితరులు

సిరిసిల్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా జయంతి వేడుకలను గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా అని ఇన్‌చార్జి కలెక్టర్ కొనియాడారు. డీటీడబ్ల్యూవో సంగీత, ఏవో రాంరెడ్డి, డీఎం డబ్ల్యూవో భారతి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ఎల్డీఎం మల్లికార్జునరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన బిర్సాముండా

సిరిసిల్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గిరిజన హక్కుల కోసం అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన మహావీరుడు,స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా ఆశయసాధనలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ కోరారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కమిటీ కార్యాలయంలో శనివారం బిర్సా ముండా జయంతి వేడుకలను బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కాంభోజు శ్రీధర్, మోర రవి తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో పిల్లలకు టీకాలు వేయాలి : డీఎంహెచ్‌వో


సిరిసిల్లలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్ల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత అన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలలో భాగంగా శనివారం జిల్లా కేంద్రం అంబేద్కర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వ్యాధి నిరోధక టీకాల నిల్వలను, ఐఎల్ఆర్, డీప్ ఫ్రిజర్, రిఫ్రిజిరేటర్‌లో వ్యాధి నిరోధక టీకాల నిల్వలను, ఐస్ ప్యాక్స్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం శాంతినగర్‌లోని వ్యాధి నిరోధక టీకాల కేంద్రంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడారు. ఐదు సంవత్సరాలులోపు ఉన్న పిల్లలందరికి సకాలంలో టీకాలు వేస్తూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కేంద్ర ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పిస్తూ సకాలంలో లక్ష్యాలు సాధించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డుకున్న యువకులు

ఇల్లంతకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతారం సమీపంలోని బిక్కవాగుపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తిచేస్తానన్న హామీని నెరవేర్చాలని యువకులు కోరారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం వెళుతుండగా యువకులు వాహనానికి అడ్డుగా వెళ్లారు. ఈసందర్భంగా యువ నాయకుడు అక్కెం నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆన్‌వీల్స్ కార్యక్రమానికి అనంతారం గ్రామానికి వచ్చినప్పుడు వంతెన పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారని, ఇంతవరకు పనులు చేపట్టలేదన్నారు. ఎమ్మెల్యేకు సమస్యను వివరించగా కాంట్రాక్టర్ రావడం లేదని చెప్పడం సమంజసం కాదన్నారు. వొల్లాల మధు, ఉతకం వెంకటేష్, వొల్లాల విన్ను, అల్లెపు కార్తీక్, చొప్పరి కిరణ్, అఖిల్, నాగరాజు, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా**


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులను చెల్లించాలని సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనకార్మికులతో నాయకులు తరలివచ్చి కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బిల్లులు, వేతనాలను చెల్లించాలని లేని పక్షంలో మధ్యాహ్న భోజన కార్మికులతో నిరవధిక సమ్మెలో వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామంటూ విద్యాశాఖ అధికారికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మల్లారపు అరుణ్‌కుమార్, కోనరావుపేట మండల మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గొట్టే బాలమణి, పులి వసంత వెంకటలక్ష్మీ, గడ్డం పద్మ, మ్యాకల కవిత, బుజ్జి గౌరవ్వ, లింగురాధా పాల్గొన్నారు.

### హక్కుల సాధనకు ఉద్యమించాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు15(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు ఉద్యమించాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య అన్నారు. ఈనెల 26న తలపెట్టిన రాజ్యాంగ హక్కుల సాధనకు ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మాల, మహర్ అనుబంధ కులాల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలు ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహకారం అందించాలన్నారు. పార్లమెంటుకు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌గా నామకరణం చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని 15నుంచి 20 శాతానికి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, బాబు, సందీప్, రామచంద్రం, సదానందం, సత్యం, నర్సయ్య, రాజ్‌కుమార్, జగన్, దాస్, మల్లేశం, గణేశ్, రవి, రాజు, భాను, జితేందర్, సురేశ్, అరుణ్, ప్రశాంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

**- జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత - ప్రత్యేక లోక్‌అదాలత్‌లో 303 కేసుల పరిష్కారం**



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత

సిరిసిల్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు బాధితులు లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని జిల్లా ఇన్‌చార్జీ ప్రధాన న్యాయమూర్తి బి. పుష్పలత కోరారు. సిరిసిల్ల జిల్లా కోర్టులో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేశారు. ఈ లోక్ అదాలత్‌లో 303 కేసులను పరిష్కారించి రూ 61 లక్షల 53వేల 958 నష్టపరిహారంగా ఇప్పించారు. ఈ లోక్ అదాలత్‌లో మోటార్ వాహన ప్రమాద కేసులు 1, సివిల్ తగాదాలు 14, భూసేకరణ కేసులు 2, క్రిమినల్ కేసులు 278, ఎక్సైజ్ కేసులు 4, చెక్‌బౌన్స్ కేసులు 3, కుటుంబ తగాదాలు 1 పరిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జీ ప్రధానన్యాయమూర్తి పుష్పలత మాట్లాడుతూ కేసులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలనే ధ్యేయంలో లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో పోక్స్ కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి సిరిసిల్ల ఇన్‌చార్జ్ లక్ష్మణాచారి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సృజన, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మేఘన, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లోక్‌అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ అన్నారు. వేములవాడ కోర్టు ఆవరణలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సివిల్ కోర్టులో 6 కేసులు, జూనియర్ సివిల్ కోర్టులో 136 కేసులు పరిష్కరించగా రూ.39.30లక్షల చెల్లింపులు జరిగాయన్నారు. ఇవే కాకుండా డ్రంకెన్ డ్రైవ్, ట్రాఫిక్ కేసులు పరిష్కారం అయ్యాయని అన్నారు. కక్షిదారుల మధ్య రాజీ ఏర్పడితే సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమం అన్నారు.

ఈ కార్యక్రమంలో, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, ప్రవీణ్, లోక్ అదాలత్ సభ్యులు తిరుమల్ గౌడ్, పొత్తూరి అనిల్ కుమార్, నాగుల సత్యనారాయణ, నక్క దివాకర్‌లు పాల్గొన్నారు.

### యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన..

తంగళ్లపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెల్ల శివారు వ్యవసాయ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు పోలీసులు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ సునీత మాట్లడుతూ రాగింగ్ నిర్వచనం, చట్టపరమైన శిక్షలను వివరించారు. అలాగే రాగింగ్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు. సీఐ మొగిలి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన పరిణామాలు, జైలు శిక్ష తదితర అంశాలను వివరించారు. అలాగే ప్రొఫేసర్ రాజా, ఎస్ఐ ఉపేంద్ర చారిలు రాగింగ్‌పై పలు అంశాలను వివరించారు.

### లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో దివ్యాంగుల ఆర్థిక పునరావాస పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు శనివారం ఎంపీడీవో శ్రీలేఖ ఆధ్వర్యంలోని అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 48 మంది దరఖాస్తుదారులకు 36 మంది హాజరయ్యాయరని ఎంపీడీవో శ్రీలేఖ పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాలను పరిశీలించామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారులకు ఆధునిక వసతులతో కూడిన విద్య

**- జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం - అంగన్‌వాడీ కేంద్ర భవనాలు ప్రారంభం**


అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఆధునిక వసతులతో కూడిన విద్య, పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం పాటుపడుతోందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో రూ.7.69 లక్షల నిధులతో తలపెట్టిన భవిత కేంద్రం నిర్మాణానికి భూమి పూజ, మద్దిమల్ల, భూక్యతండా, కంచర్ల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్ర భవనాలను సంబంధిత శాఖ అధికారులతో కలిసి శనివారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. చిన్నారుల అవసరాలకు తగినట్టు భవనాలను నిర్మించిందన్నారు. కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యను బోధించి ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సర్కారు ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఎంపీడీవో శ్రీలేఖ, ఎంపీవో బీరయ్య, ఎల్లారెడ్డిపేట ఎంఈవో కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ రాములునాయక్, వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఎస్ఐ లక్ష్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**


ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్

ఇల్లంతకుంట,నవంబరు 15(ఆంధ్రజ్యోతి):నిరుపేద ప్రజల సొంతింటి కల తీర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ గరిమా అగర్వాల్ కలిసి ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద వసతులు లేకపోవడం వల్ల పంపిణీ ఆలస్యం జరిగిందన్నారు. అర్హులైన వారందరికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లర్ రూఫింగ్‌తో ఖర్చు తగ్గుతుందన్నారు. ఈవిధానం అనుసరించడం వల్ల ఇంటిలో ఉష్ణోగ్రత కొంత తగ్గుతుందన్నారు. మండలకేంద్రంలోని మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతారం, సిరికొండ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశాలల్లో పాల్గొని లబ్దిదారులను అభినందించారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ డీఈ ఖాజాముజాఫర్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు తీగల పుష్పలత, చిట్టి ఆనందరెడ్డి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, మామిడి రాజు, రమేష్, మామిడి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి


జయసింహారెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఎస్సై సీహెచ్‌గణేశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. ఆవునూర్ గ్రామానికి చెందిన బద్ది జయసింహారెడ్డి(65) అనేరైతు తన వ్యవసాయపొలం వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు బోర్‌మోటార్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు భానుచందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

## ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరి మృతి


సరేందర్(ఫైల్)

జమ్మికుంట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గుల్లి సరేందర్ (50) ప్రమాదవశాత్తు రైలు కింద పడి శనివారం మృత్యువాత పడ్డాడు. సరేందర్ సుతారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం పక్షవాతం రాగా, కొద్ది నెలల క్రితం తిరిగి కోలుకున్నాడు. ప్రస్తుతం సుతారి పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా మడిపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఉన్న రైల్వేగేట్ వద్ద ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

## బాలిక ఆకస్మిక మృతి


రెడ్డి అర్చన(ఫైల్)

సైదాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలం సర్వాయిపేట పంచాయతీ పరిధిలోని శివరాంపల్లిలో రెడ్డి అర్చన (16) ఆకస్మికంగా మృతిచెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివరాంపల్లికి చెందిన అర్చన సోమారం మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్ర వారం సాయంత్రం తల్లిదండ్రులతో సరదాగా గడిపి రాత్రి నిద్ర పోయిన అర్చన ఉదయం లేచేసరికి మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అర్చన తండ్రి రెడ్డి రాజు ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టు మార్టం రిపోర్టుతో బాలిక మృతి కారణం తెలిసే అవకాశం ఉంది.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో శిక్ష పడుతుందని యువకుడి బలవన్మరణం


సూర విజయ్(ఫైల్)

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌కేసులో శిక్ష పడుతుందనే భయంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేష్‌రెడ్డి, విజయ్ తల్లి ఫిర్యాదు మేరకు... చొప్పదండి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సూరవిజయ్(28) చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. విజయ్‌కి భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈనెల 1న చొప్పదండి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీలు చేస్తుండగా విజయ్ పట్టుబడ్డాడు. విజయ్‌పై కేసు పెట్టిన పోలీసులు శుక్రవారం కోర్టుకు తీసుకెళ్లారు. మేజిస్ట్రేట్ సెలువులో ఉండడంతో విజయ్‌తిరిగి ఇంటికి వచ్చాడు. వచ్చిన తర్వాత కేసులో శిక్ష పడుతుందని, ఫైన్ కట్టడానికి డబ్బులు లేవని భార్యతోవిజయ్ చెప్పాడు. మనస్తాపం చెందిన విజయ్ శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విజయ్‌తల్లి నాగమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అదుపు తప్పి టిప్పర్ బోల్తా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల-రాగట్లపల్లి గ్రామాల మధ్య రహదారిలో అదుపుతప్పి టిప్పర్ వ్యవసాయ పొలంలో బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇక్కట్లు

● ఇసుక, కంకర ధరల పెరుగుదల


హుజూరాబాద్‌లో ఇసుక లేక మధ్యలోనే వదిలేసిన ఇందిరమ్మ ఇంటి పనులు

హుజూరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇసుక, కంకర ధరలు పెరగడం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో కొందరు ఇళ్ల నిర్మాణ పనులు నిలిపివేశారు. రెండు నెలలుగా ఇసుక, కంకర ధరలను వ్యాపారులు ఇష్టానుసారంగా పెంచేశారు.ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చేసిన ఇళ్ల నిర్మాణాల ఆధారంగా డబ్బులు జమ చేసింది. ఆ డబ్బులు సరిపోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

హుజూ రాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట,వీణవంక మండలాల్లో మానేరు వాగు ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు వాగు ప్రవ హించడంతో ఇసుక దొరకడం లేదు. దొరికిన ఇసుక ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున దోపిడీ చేస్తున్నారు. దళారులే ధరలు పెంచుతు న్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో జమ్మి కుంట, ఇల్లందకుంట, వీణవంక, హుజూరాబాద్, కమలాపూర్ మండలాలు ఉండగా, అందు లో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యా యి. ఆరునెలల క్రితం ట్రాక్టర్ ఇసుక రూ.2800నుంచి రూ.3వేల వరకు లభిం చింది. అంతేకాకుండా గృహ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుండడంతో క్రషర్ యజమానులు కంకర ధరలను కూడా పెంచేశారు. ఓ వైపు కంకర, మరో వైపు ఇసుక ధరలు పెంచడంతో సామా న్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక, కంకర దళారులను అరికట్టడంలో రెవెన్యూ, పోలీసులు విఫలమయ్యారనే ఆరోపిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసు కను ఉచితంగా లేదా రాయితీపై అందించాల్సి ఉండగా పట్టించుకోవడ లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, కంకరను ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టేపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12ట్రాక్టర్లను శనివారం రెవెన్యూసిబ్బంది, పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలం నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతోపాటు పలు గృహాల నిర్మాణాలకు ఈ ప్రాంతంలోని మానేరువాగు నుంచి ఇసుకను ఉచితంగా ట్రాక్టర్ల ద్వారా రవాణాచేయడానికి అనుమతి ఉంది. ఉదయం8నుంచి సాయంత్రం 5గంటల వరకు మానేరువాగు నుంచి ఇసుక ట్రాక్టర్లు రవాణా చేయాల్సి ఉండగా, నిబంధనలకు వ్యతిరేకంగా తెల్లవారుజాము నుంచే ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను కొన్నిచోట్ల డంప్‌చేసి, అధికధరలకు విక్రయించుకుంటూసొమ్ము చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమంగా ఇసుకతరలిస్తున్న 12ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ వినోద్ తెలిపారు.


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 20మందికి గాయాలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..**




లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ప్రమాద స్థలంలో రోదిస్తున్న మహిళ

**లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు..**

మానకొండూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద ఆర్టీసీ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో 15మంది ప్రయాణికులు గాయపడ్డారు. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం నిజామాబాద్ నుంచి వరంగల్‌కు బయల్దేరింది. మానకొండూర్ మండలంలోని సదాశివపల్లి బస్టాండ్ వద్ద కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ బ్రేక్ వేయడంతో వెనక నుంచి ఆర్టీసీ బస్సు దానిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో సీట్లలో కూర్చున్న 15మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డవారిలో నిజామాబాద్, జగిత్యాల, హుజూరాబాద్, వరంగల్ జిల్లాల ప్రయాణికులు ఉన్నారు. ఘటనలో బస్సు డ్రైవర్ వైపు ఉన్న అద్దం పగిలిపోయింది. ప్రమాదానికి గురైన బస్సును, లారీని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు వేగంగా వెళ్లవద్దని బస్సు డ్రైవర్‌కు సూచించినా పట్టించుకోలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆటో ట్రాలీ బోల్తా పడి..**

**జమ్మికుంట :** జమ్మికుంట మండలం తనుగుల శివారులో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటో ట్రాలీ శనివారం ప్రమాదవశాత్తు బోల్తాపడింది. వీణవంక మండలం ఎల్బాక గ్రామానికిచెందిన 25మంది వ్యవసాయ కూలీలు జమ్మికుంట మండలం నాగారం గ్రామంలో పత్తి ఏరడానికి ఆటోట్రాలీలో ఉదయం ఇంటి నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో తనుగుల శివారులోని గుంపుల క్రాస్‌రోడ్ వద్ద ప్రమాదవశాత్తు ఆటోట్రాలీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా, మరో 21మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108అంబులెన్స్‌లో జమ్మికుంటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణగౌడ్ ఆసుపత్రికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగినట్లు పోలీస్‌లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

**రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి..**

**ఇల్లంతకుంట :** మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన కూస అంజిరెడ్డి అనే ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలను ఢీకొని గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపాక గ్రామంలో శనివారం జరిగిన వారసంతకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ప్రమాదంలో అంజిరెడ్డి గాయపడగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

### ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

ఎలిగేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీ ఎదుట గల చౌరస్తాలో శనివారం ఉదయం ఇసుక ట్రాక్టర్ ఢీకొని పెద్దేల్లి సుధీర్(50) మృతిచెందినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన సుధీర్ గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీగా ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా సుల్తాన్‌పూర్‌లో ఎదురుగా అతివేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధీర్ ఛాతిపై నుంచి ట్రాక్టర్ వెనుకటైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ శశికుమార్ అజాగ్రత్తగా వేగంగా నడపడం వల్లే ఈ దుర్ఘటన జరిగినట్లు ఆయన తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించగా, మృతుడి భార్య పెద్దేల్లి ఉమా ఫిర్యాదుమేరకు డ్రైవర్ శశికుమార్, యజ మాని ఆవుల సంపత్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### కారు ఢీకొని ఒకరి మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామశివారులో శుక్రవారం కారు బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న తాటిపల్లి గ్రామానికి చెందిన ఒజ్జల గంగాధర్(55) చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ కథనం ప్రకారం గంగాధర్ తన స్వగ్రామం తాటిపల్లి గ్రామం నుంచి జగిత్యాలకు పనినిమిత్తం బైక్‌మీద వెళ్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన గంగాధర్‌ను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

# దొంగతనాల కేసుల్లో ఆరుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు, రాగితీగ

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో కొన్నినెలలుగా రైతులు, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించిన, దొంగతనాల కేసులకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీ స్‌కమిషనర్ గౌస్‌ఆలం వివరాలు వెల్లడించారు. చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ చౌరస్తావద్ద శనివారం పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వెళ్తున్న రెండు వాహనాలను తనిఖీచేయగా దొంగతనాలకు సంబంధించి నిందితులను పట్టుకున్నారు. చొప్పదండి, చిగురుమామిడి, మానకొండూర్, గంగాధర, కరీంనగర్‌రూరల్, రామడుగు, ఎల్ఎండీ, దుగ్గొండి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వారు 15దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. కట్టరాంపూర్‌కు చెందిన మనుపాటి శేఖర్, చొప్పదండికి చెందిన మనుపాటి సంజీవ్, బేగంపేటలోని రామగిరికి చెందిన ఉండాటి మహేశ్, ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్‌కు చెందిన బోదాసు కుమార్, కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్‌కు చెందిన సాగర్ల రంజిత్, చొప్పదండికి చెందిన బొడిగే స్క్రాప్‌వ్యాపారి సంపత్(రిసీవర్)ను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రెండు పికప్ వాహనాలు, ద్విచక్రవాహనం, 3క్వింటాళ్ల కాపర్ వైరు స్వాధీనం చేసుకున్నామని, వాటి మొత్తం విలువ సుమారు రూ.20 లక్షలుగా ఉంటుందని సీపీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కేసులకు సంబంధించి పరారీలో ఉన్న మిగతా 8మందికోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

● **సీపీ అభినందనలు**

కరీంనగర్‌రూరల్ ఏసీపీ విజయకుమార్ నేతృత్వంలో కేసులను ఛేదించగా బృందంలోని ప్రదీప్‌కుమార్(సీఐ చొప్పదండి), సంజీవ్ (సీఐ మానకొండూర్), నరేష్ రెడ్డి(ఎస్సై), వంశీకృష్ణ(ఎస్సై గంగాధర) సిబ్బంది అనిల్, రాజ్‌నాయక్, హేమసుందర్, శ్రీనివాస్, హసనొద్దీన్, రవీందర్, సృజన్‌ను సీపీ గౌస్ ఆలం అభినందించారు.

# పోలీసుల పేరుతో దోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్టు


నిందితులను అరెస్ట్ చూపుతున్న డీసీపీ కరుణాకర్

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాతనేరస్తులు ఒక ముఠాగా ఏర్పడి పోలీసులమంటూ దోపిడికి పాల్పడి అడ్డంగా దొరికిపోయారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల అరెస్ట్‌ను చూపారు. డీసీపీ మాట్లాడుతూ రేగడిమద్దికుంటకు చెందిన నాగుల కుమారస్వామి, కాల్వశ్రీరాంపూర్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన తిప్పని రవీందర్, పోవరి శ్యాంరావు, సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌కు చెందిన పురుషోత్తం నాగరాజులు ముఠాగా ఏర్పడ్డారు. వారి అప్పులు తీర్చేందుకు గతంలో మావోయిస్టు పేరుతో డబ్బులు వసూలు చేసిన నాగుల కుమారస్వామి పోలీసుల పేరుతో దోపిడి చేయాలనే ఆలోచన చేశారు. నలుగురిలో ముఠా సభ్యుడైన పురుషోత్తమ నాగరాజు దోపిడీ కోసం గర్రెపల్లిలోని బంధువుల ఇంటినే ఎంచుకున్నారు. నలుగురు కలిసి ఈ నెల10న గర్రెపల్లిలోని సంగం లక్ష్మి ఇంటికి తెల్లవారుజామున చేరుకొన్నారు. తలుపులు తీసిన లక్ష్మితో తాము కరీంనగర్‌కు వన్‌టౌన్ పోలీసులమని, కరీంనగర్‌లో మీ కొడుకు రమేష్ పని చేస్తున్నాడని, అతని యజమాని దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నాడని, అతనికి సంబంధించిన దొంగ నోట్లను ఇంట్లో దాచిన సమాచారం మేరకు ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంట్లో నిద్రపోతున్న రమేష్‌ను లేపి చేతికి బేడీలను వేసి బీరువా తీయాలని బెదిరించి అందులోని బ్యాగును తీసుకొని, బంగారం, వెండి, నగదును తీసుకొని వెళుతూ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని పేర్కొన్నారు. అయితే వచ్చిన వారు నకిలీ పోలీసుల గ్రహించి బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, సనత్‌రెడ్డి, వెంకటేష్‌లు బృందాలుగా విడిపోయి దొంగల ఆచూకీకి ప్రయత్నించగా శనివారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.11.50లక్షల విలువగల 115 గ్రాముల బంగారం, రూ.50వేల విలువగల 472 గ్రాముల వెండి, రూ10వేల నగదుతోపాటు దోపిడికి ఉపయోగించిన రెండు కార్లు, ఒకబైక్, పోలీస్ దుస్తులు, బేడీలను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్‌ఐలతోపాటు హెడ్‌కానిస్టేబుల్ పలువురు పోలీసులకు డీసీపీ నగదు రివార్డులను అందజేశారు. సమావేశంలో ఏసీపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

పెద్దపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి వివాహం చేసుకొని ఆరునెలల అనంతరం వద్దని చెప్పడంతో భర్త ఇంటి ఎదుట బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళన చేసిన సంఘటన పెద్దపల్లి మండలంలో చోటుచేసుకుంది. బొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మేరపల్లికి చెందిన బోదాసు అభిషేక్ అదేగ్రామానికి చెందిన దండుగుల శ్రీలతను ఆరునెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఆరునెలలపాటు ఇద్దరు కలిసి పెద్దపల్లిలో నివసించినట్లు తెలిపారు. కొన్నిరోజుల క్రితం పెళ్లిచేసుకున్న వ్యక్తి తననువద్దని తెలుపడంతో ఇంటిఎదుట బైఠాయించినట్లు పేర్కొన్నారు. స్థానిక పెద్దలసమక్షంలో ఒప్పందం కుదుర్చుకోవడంతో గొడవ సద్దుమనిగినట్లు తెలిపారు.

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్‌రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ సెక్రెటరీ జెజె రత్నం ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీసంస్థలో 35నుంచి 40సంవత్సరాలు పనిచేసిన వారికి ఇబ్బందులు తపపడం లేదని తెలిపారు. 2017లో ఇవ్వాల్సిన పీఆర్‌సీ 2021లో ఇవ్వగా 2017నుంచి చెల్లిం చాల్సిన పీఆర్‌సీ ఏరియర్స్ ఇంతవరకు రాలేదని పేర్కొన్నారు. 2017లో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఎనిమిది సంవత్సరాలు గడిచినా ఇంతవరకు రాలేదన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీఅధికారులు చొరవ తీసుకోవాలని, ఆదుకోవాలని కోరారు.

# గోదావరిఖనిలో గంజాయి విక్రయ ముఠా అరెస్టు

● 1.4కిలోల గంజాయి స్వాధీనం ● ఆరు సెల్‌ఫోన్లు సీజ్



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర బల్లార్ష నుంచి గోదావరిఖనికి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్, పవర్‌హౌస్‌కాలనీకి చెందిన కొప్పులసాయి ధనుష్, మంచికట్ల అక్షయ్, సప్తగిరి కాలనీకి చెందిన మాటూరి సాత్విక్, అంతర్గాం రాజాపురంకు చెందిన చిలుక వినీత్, రామగుండం రైల్వే స్టేషన్ ఏరియాకు చెందిన బూక్య రాజేష్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వారు వినియోగిస్తున్న ఆరు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. స్థానిక కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్ కూలీ చేసుకుంటుండేవాడు. జల్సాలకు అలవాటు పడి బల్లార్ష నుంచి గంజాయి తీసుకువచ్చి గోదావరిఖని, ఇతర ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో గోదావరిఖని, రామగుండంకు చెందిన యువకులతో పరిచయం ఏర్పడింది. వీరంతా గంజాయికి బానిసలై గంజాయి రవాణా, విక్రయాలు జరుపాలని నిర్ణయించుకున్నారు. మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయించేవారు. శుక్రవారం కాకతీయనగర్ వాటర్ ట్యాంకు వద్ద గంజాయి అమ్మకాలకు ప్రయత్నిస్తున్న చిక్కుడు రాహుల్‌ను పట్టుకుని అతని వద్ద 900గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో కొప్పుల సాయి ధనుష్, చిలుక వినీత్, మంచికట్ల అక్షయ్, మాటూరి సాత్విక్, బూక్య రాజేష్‌లను పట్టుకుని వారి వద్ద 500గ్రాముల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ రమేష్, క్రైమ్‌పార్టీ సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్, శ్రీనివాస్, సదానందం, కానిస్టేబుళ్లు ప్రకాష్, రమేష్, మధుకర్, మధుసూదన్‌లను సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌లు అభినందించారు.

## మృతిపై ఫిర్యాదు

ముత్తారం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సొన్నాయిల మధునయ్య(80) మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కాసర్లగడ్డకు చెందిన అనుము రామస్వామి ముత్తారం పోలీసులకు శనివారం ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడి కుమార్తె మబ్బు స్నేహలత తండ్రి అనారోగ్యంతో బాధ పడుతున్నాడని ఈ నెల 14న ఆమె వెంట తీసుకెళ్లిందని, అదే రోజు సాయంత్రం మధునయ్య ఆరోగ్యం బాగాలేదని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నాడు. చికిత్స పొందుతూ మరణించాడని స్నేహలత తెలిపారని రామస్వామి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆయన మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోస్టుమార్టం జరిపించాలని మంథని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, తదితరులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కాలభైరవస్వామి, సంతాన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపిలు వేర్వేరుగా హాజరై స్వామివారి సన్నిధుల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హిందువులు హైందవ ధర్మం పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేములవాడలో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. పురాతన దేవాలయాలు, హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషిచేయాలన్నారు. అంతకు ముందు ఆలయంలో యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, శివపార్వతుల కల్యాణం, స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## దర్శనాలకు నిలయం.. భీమేశ్వరాలయం

- విశాలంగా ఆలయ ఆవరణ
- కోడెల మొక్కులు సులభతరం
- భక్తుల రద్దీకి అనువైన స్థలం
- రథశాలలోకి ఆర్జిత సేవల బుకింగ్ కార్యాలయం
- భీమేశ్వర సదన్‌లో అధికారిక కార్యకలాపాలు



భీమేశ్వరాలయంలో భక్తులు (ఫైల్)

ముఖ్య బుకింగ్ కౌంటర్

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో విస్తరణ పనుల నేపథ్యంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయడంతో భీమేశ్వరాలయం భక్తులకు కేంద్రమైంది. ప్రస్తుతం భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలు సులభం అవుతోంది. ఆలయంలో విశాలమైన ఆవరణ ఉండడంతో కోడెల మొక్కులు చెల్లించే భక్తులకు అనువుగా ఉంది. దీంతో స్పెషల్ కోడే, సాధారణ కోడె మొక్కులు చెల్లించే భక్తులకు ఇక్కట్లు తగ్గాయి. వేలాది మంది భక్తులు వచ్చినా దర్శనం చేసుకునే అవకాశం ఉంది.

### ● రథశాల వద్ద ముఖ్య బుకింగ్ కౌంటర్

భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలు నిర్వహించే భక్తులకు ముఖ్య బుకింగ్ కౌంటర్‌ను రథశాలకు మార్చారు. గత ఆది, సోమవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆర్జిత సేవలు చేసుకునే భక్తు లకు టికెట్ తీసుకోవడం గగనమైంది. బుకింగ్ కౌంటర్‌లో భక్తులు తోసుకోవడంతో క్యూలైన్ బారికేడ్ పక్కకు జరిగిపోయింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు రథశాల వద్ద ముఖ్య బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌లో అన్ని ఆర్జిత సేవల టికెట్లు తీసుకొని పూజలు చేసుకోవచ్చు.



ఉత్తరం వైపు ఏర్పాటు చేసిన రేకుల ఫెన్సింగ్

### ● భీమేశ్వర సదన్‌లో అధికార కార్యకలాపాలు

పాత భవనాలన్నీ తొలగించడంతో భీమేశ్వర సదన్‌లో అధికార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గత నెల నుంచి సదన్ పైఅంతస్తులో ఈవో కార్యాలయం ఏర్పాటు చేశారు. కింది అంతస్తులో ఇంజనీరింగ్ కార్యాలయం ఏర్పాటు చేసి కార్యకలాపాలు సాగిస్తున్నారు. భీమేశ్వర గెస్ట్ హౌజ్-1లో ప్రోటోకాల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులో వివిపీలు, ఇతర సిఫారసు లేఖలు ఉన్న వారు సంప్రదిస్తే దర్శనం ఏర్పాట్లు చేస్తారు. మరో భీమేశ్వర గెస్ట్ హౌజ్-3లోకి ప్రసాదాల తయారీ కేంద్రం ఏర్పరచి లడ్డూలు, పులిహోర ప్రసాదాలు తయారుచేస్తున్నారు.

## పాఠశాలల మూసివేత తగదు

● కిష్టంపేట పాఠశాలను సందర్శించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

చందుర్తి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలను మూసివేయడం తగదని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్రఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేట ఉన్నతపాఠశాలను మూసివేయడాన్ని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీబృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండువేల జనాభా కలిగిన గ్రామంలో పాఠశాలకు రావలసిన వయసు కలిగిన విద్యార్థులు దాదాపు 200మంది వరకు ఉన్నప్పటికీ పాఠశాలలో విద్యార్థులు లేరని మూసివేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సందర్భంలో పాఠశాలలు మూసివేయమని గతంలో మూతబడిన పాఠశాలలను ఒక్క విద్యార్థి ఉన్న తెరుస్తామని వాగ్దానం చేశారు. కానీ గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో వేలాది పాఠశాలలను విద్యార్థుల సంఖ్య తగ్గిందని, విద్యార్థులు రావడంలేదని అనేక పాఠశాలలను మూసివేశారన్నారు. దీనిని విద్యాపరిరక్షణకమిటీ తీవ్రంగా నిరసిస్తున్నదన్నారు. ప్రస్తుతం కిష్టంపేట పాఠశాలలో అన్ని సౌకర్యాలు గదులు తగినంత మంది ఉపాధ్యాయులు ఉన్నందున జిల్లా విద్యాధికారి, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై అశోక్ కుమార్ సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘుశంకర్‌రెడ్డి, కార్యదర్శి కే రవిచందర్, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, ఉపాధ్యాయ ఐకాస జిల్లా కో-కన్వీనర్ విక్కుర్తి లక్ష్మీనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కొమ్ము రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టంపేట పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ బృందం

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన




కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలోగల శేషప్ప కళావేదిక పై హైదరాబాద్ పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడిస్సి కూచిపూడి నృత్యప్రదర్శన శనివారం ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూడిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించడానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ మాజీచైర్మన్ సంగనభట్ల దినేష్, ఆలయఈవో సంకటాలశ్రీనివాస్, వేదపండితులు, అర్చకుల చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గంటల తరబడి చిన్నారులచే నిర్వహించిన ఒడిస్సి కూచిపూడి నృత్యప్రదర్శనలను భక్తులు ఎంతో ఓపికతో తిలకించారు.

చిన్నారులను ఆలయం పక్షానచైర్మన్, ఈవో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదిత, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాద దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం

● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు నోటీసులు? ● ఇప్పటికే నిందితులను విచారించిన అధికారులు
● అప్పటి పోలీస్ అధికారులను విచారించే అవకాశం...

కోల్‌సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు గట్టు వామన్‌రావు, నాగమణి దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసునమోదు చేసిన సీబీఐ విచారణ ప్రారంభించింది. రామగుండం పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా ఈ విచారణ జరుపుతున్నారు. వామన్‌రావు తండ్రి కిషన్‌రావు నుంచి వాంగ్మూలం తీసుకున్న సీబీఐ అధికారులు హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. రెండు మాసాలుగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న పలువురిని ఇప్పటికే విచారించింది. ఈ విచారణలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధును విచారించాలని నిర్ణయించిన సీబీఐ ఆయనకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. పుట్టమధు సోమవారం గోదావరిఖనిలోని రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ప్రాంగణంలో సీబీఐ ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. సీబీఐకి చెందిన డీఎస్పీస్థాయి అధికారులు మధును విచారించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే మధును విచారించాల్సిన అంశాలపై నోట్ సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ కేసులో ఏ3గా ఉన్న పుట్ట మధు మేనల్లుడు బిట్టును సీబీఐ అధికారులు విచారించారు. న్యాయవాద దంపతులను 2021 సెప్టెంబరు 17న మంథని కోర్టు నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యలో రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వచర్ల వద్ద నడిరోడ్డుపై హత్య చేశారు. ఈ కేసులో అప్పటి కమిషరేట్ అడిషనల్‌డీసీపీ(అడ్మిన్) అశోక్ కుమార్ విచారణాధికారిగా వ్యవహరించారు. అప్పటి రామగిరి ఎస్ఐ మహేందర్, విచారణ అధికారి అశోక్‌కుమార్‌ను సీబీఐ విచారించే అవకాశం ఉంది.

ఈ కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఐజీ, పోలీస్ కమిషనర్ ఎప్పటికప్పుడు కేసు పురోగతిని సమీక్షించారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు జరుపుతుండడంతో ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇప్పటికే ఫైళ్లను స్వాధీనం చేసుకున్న సీబీఐ పోలీస్ విచారణలోని లోపాలపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తుంది.

## విద్యా బోధనకు దూరం చేసే కార్యక్రమాలను రద్దు చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను విద్యా బోధనకు దూరం చేసే కార్యక్రమాలను ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్‌టీచర్స్‌ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్రఅధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో పర్యవేక్షణకు డిప్యూటేషన్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించకూడదన్నారు. గత పీఆర్సీ గడువుముగిసి రెండేళ్లు గడుస్తున్న నూతన పీఆర్సీని ప్రకటించకపోవడం ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. హక్కుల సాధనకు నిర్వహించనున్న ఉద్యమాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని అనిల్ కుమార్ కోరారు. సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు రామచంద్రం, శ్రీనివాస్,సతీష్, గంగయ్య, రమేశ్, శ్రీకాంత్, సురేందర్‌పాల్గొన్నారు.

## భీమేశ్వరాలయంలో కార్తీక పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. శనివారం ఆలయ ఈవో ఎల్. రమాదేవి, పట్టణ సీఐ వీరప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భీమేశ్వరాలయ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. శని, ఆదివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. కోడె క్యూలైన్, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం, లడ్డు కౌంటర్, ప్రోటోకాల్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో భక్తులకు ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎల్లాగౌడ్, డీఈ మధు రఘునందన్, ఏఈవో శ్రావణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


### వైభవంగా కార్తీక దీపోత్సవం..

భీమేశ్వరాలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. మహిళలకు వాయినం అందజేశారు.

## ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



ధర్మపురిలో భక్తుల రద్దీ



కొండగట్టులో భక్తులు

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామివారల నిత్యకళ్యాణం జరిపించి పూజలుచేశారు. యమధర్మ రాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంవద్ద నాగదేవతకు, రావిచెట్టు ఆంజనేయస్వామివారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనేకమంది దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు,అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పక్షానఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

### కొండగట్టులో భక్తుల సందడి..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీకమాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

### గోదావరి హారతి..

ధర్మపురి: కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరిహారతి 25వరోజు శని వారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి

## కొండగట్టులో పెద్దపల్లి జిల్లా వాసి కిడ్నాప్

● తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు

● ముగ్గురిపై కేసు

మల్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన పెద్దపల్లి జిల్లాకు చెందిన దోమల రమేశ్ అనే వ్యక్తి కిడ్నాప్ కాగా తప్పించుకొని వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎల్కలపల్లికి చెందిన దోమల రమేశ్ అనే వ్యక్తి లోన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలల క్రితం గడ్డి నాగరాజు, బూర బాబులకు భూమిపై పెద్ద మొత్తంలో రుణం ఇప్పిస్తానని రూ.పది లక్షల మేర వసూలు చేశాడు. రుణం ఇప్పించకపోవడంతో ఐదు నెలలుగా తమ డబ్బులు ఇవ్వాలని కోరుతున్నప్పటికీ ఇవ్వడం లేదు. దీంతో బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన రమేష్‌ను నాగరాజు, బాబు కారులో వేములవాడకు తీసుకెళ్లారు. అక్కడ ముడికే అంజయ్య అనే మరో వ్యక్తితో కలిసి రమేశ్‌ను హైదరాబాద్‌కు తరలించి ఓ హోటల్లో బంధించి డబ్బులు ఇవ్వాలని దాడి చేశారు. అనంతరం రమేశ్‌ను శుక్రవారం రాత్రి వేములవాడకు తీసుకువచ్చి ఓ గదిలో ఉంచగా శనివారం అక్కడి నుంచి తప్పించుకొని మల్యాల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనను కిడ్నాప్ చేసిన నాగరాజు, బాబు, అంజయ్యపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## 18న ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు సమావేశం

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని షాదీఖానాలో ఈనెల 18న ఉదయం 11 గంటలకు ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల మసీదు ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజిమెంట్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ అజ్మతుల్లా హుస్సేన్ జిల్లా పర్యటన సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశామని, దీనికి ఉమ్మడి జిల్లాల మసీద్, ఈద్గా, కబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

## పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల కరీంనగర్‌లో 2025-26 విద్యాసంవత్సరం పీజీ కోర్సుల్లో ఖాళీల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి ప్రకటనలో తెలిపారు. ఎంఏ(ఇంగ్లీష్), ఎంఏ (తెలుగు), ఎంకాం, ఎమ్మెస్సీ(బోటనీ), ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(ఫిజిక్స్), ఎమ్మెస్సీ(జువాలజీ) కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో ఈనెల17వ తేదీ సోమవారం సాయంత్రం 5గంటలలోపు అందజేయాలని తెలిపారు. 18వ తేదీన సిపిగేట్-2025 నిబంధనలప్రకారం అర్హతలు ఉన్న వారికి సీటు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లో సీటులభించిన విద్యార్థినులకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించదని, నిర్ణీత ఫీజు కళాశాలలో చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## శ్రీరాంసాగర్‌కు స్థిరంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్‌భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్‌గేట్ల ద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీకాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

## రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు ప్రారంభం

- ఉమ్మడి పది జిల్లాల నుంచి 330 మంది హాజరు
- పోటీలను ప్రారంభించిన డీఈవో శ్రీరామ్ మొండయ్య




యోగాసనాలు వేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) యోగా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రామడుగు మండలం వెలిచాల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి అండర్-14, 17 బాలబాలికలు, మొత్తం 260 మంది క్రీడాకారులు, 60 మంది అధికారులు, 30మంది అఫీషియల్స్ హాజరయ్యారు. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగాను ఒక క్రీడగానే కాకుండా నిత్య జీవితంలో భాగంగా ప్రతీరోజు అభ్యాసం చేయాలన్నారు. యోగాతో ఆరోగ్యం, ఆనందం పొందుతామన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేయాలన్నారు. జాతీయస్థాయి యోగా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి భగవంతయ్య, ఎంఈవో రంగనాథ శర్మ, వెలిచాల పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్, పోటీల రాష్ట్ర పరిశీలకులు సతీష్, శ్రీనివాస్, జిల్లావ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ అధ్యక్షులు బాబు శ్రీనివాస్, నిర్వహణ కమిటీ బాధ్యులు వీర్ల హనుమంతరావు, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, వెలిచాల యూత్ సభ్యులు, నర్సింగరావు, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ దత్తాద్రి శర్మ, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధారెడ్డి, బాధ్యులు శర్మ, కోచ్ రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ సభ్యులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## 'సహకారం' ఎప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

ఏడాదికి రూ 6 లక్షల చొప్పున రూ 18 లక్షలు ఇస్తుంది. ప్రస్తుతం సహకార శాఖ అధికారులు ఉద్యోగులకే రైతు ఉత్పత్తి సంస్థల బాధ్యతలను అప్పగించనుంది. ఈ పథకానికి సంబంధించి ప్రత్యేక క్రెడిట్ గ్యారంటీ కింద నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. ఎన్‌సీడీసీ, నాబార్డ్ ద్వారా ఈ పథకాన్ని అమల్లోకి తీసుకరానున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సహకార సంఘాలు వేర్వేరు లక్ష్యాలతో ఉన్న ఇవి రెండు ఒకే రకమైన సంస్థలుగా పనిచేస్తాయి. ఎఫ్‌పీవోలు ప్రధానంగా రైతుల ఆదాయం పెంచడానికి ఉత్పత్తులు పెంచడానికి, ప్రాసెసింగ్ చేయడంపై దృష్టి పెడతారు. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చే దిశగానే రైతు ఉత్పత్తి సంస్థలు పనిచేస్తాయి. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు చేస్తున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి టి రామకృష్ణ తెలిపారు.

### సొసైటీల్లో 74728 మంది సభ్యులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం 24 సంఘాలు ఉన్నాయి. సంఘాల పరిధిలో 74728 మంది సభ్యులు ఉన్నారు. సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 12859 మంది సభ్యులు ఉండగా పెద్దూరు సొసైటీలో 1336 మంది, నేరెల్ల సొసైటీలో 1257 మంది, కోనరావుపేట సొసైటీలో 6196 మంది, కొలనూరు సొసైటీలో 3018 మంది, వేములవాడ సొసైటీలో 8180 మంది, నాంపెల్లి సొసైటీలో 1191 మంది, రుద్రవరం సొసైటీలో 998 మంది, చందుర్తి సొసైటీలో 3369 మంది, సనుగుల సొసైటీలో 1733 మంది, బోయినిపల్లి సొసైటీలో 910 మంది, కోరెం సొసైటీలో 1694 మంది, మాన్వాడ సొసైటీలో 1163 మంది, నర్సింగాపూర్ సొసైటీలో 1684 మంది, ఇల్లంతకుంట సొసైటీలో 3547 మంది, గాలిపెల్లి సొసైటీలో 1680 మంది, ముస్తాబాద్ సొసైటీలో 2082 మంది, పోత్గల్ సొసైటీలో 7169 మంది, గంభీరావుపేట సొసైటీలో 8183 మంది, కొత్తపెల్లి సొసైటీలో 3680 మంది, ఎల్లారెడ్డిపేట సొసైటీలో 3864 మంది, అల్మాస్‌పూర్ సొసైటీలో 2139 మంది, తిమ్మాపూర్ సొసైటీలో 1597 మంది, మానాల సొసైటీలో 199 మంది సభ్యులు ఉన్నారు. సొసైటీలను విస్తరించి వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయాలని రైతులు కోరుతున్నారు.

# నెరవేరుతున్న పేదల సొంతింటి కల

### - ఆనందంలో ఇందిరమ్మ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్(ఫైల్)

ఇల్లంతకుంట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : స్వంత ఇల్లులేక, నెలనెల ఇంటి అద్దె చెల్లించేందుకు అనేక కష్టాలు పడ్డారు. ప్రభుత్వం స్వంత స్థలంలో ఇంటిని నిర్మించుకుంటే ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించడంతో వారిలో ఆశలు రేకెత్తాయి. ప్రభుత్వం గత సంవత్సరం ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని ప్రవేశపెట్టింది. మండలంలోని సిరికొండ గ్రామాన్ని పైలట్ గ్రామంగా తీసుకొని 45 ఇళ్లను మంజూరు చేసింది. దీనితో కొంతమంది నిర్మాణాలు ప్రారంభించగా మరికొంత మంది తాత్సార్యం చేశారు. అనంతరం మండలానికి 805ఇళ్లను మంజూరు చేసింది. నిర్మాణాల స్థాయిని బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులను జమచేయడం ప్రారంభించింది. 128 గృహాలు స్లాబ్ వరకు, 110 ఇల్లు రూఫ్‌లెవల్ మిగతా గృహాలు వివిద స్థాయిలలో ఉన్నాయి. సిరికొండ, అనంతగిరి గ్రామాలలో రెండు ఇళ్ల నిర్మాణాలు పూర్తికావడం గృహప్రవేశాలు శనివారం జరుగాయి. కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ గరిమా అగర్వాల్ వచ్చి కుటుంబీకులతో కలిసి గృహప్రవేశ వేడుకలలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకం వల్ల తమ స్వంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

### డబుల్ లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు

ఇల్లంతకుంట, ఒగులాపూర్ గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టి చాలా కాలం అయినా పంపిణీకి నోచుకోలేదు. ఇళ్ల వద్ద సరైన వసతులు లేకపోవడంతో పంపిణీ జరుగలేదు. నిరుపేదలు ఇల్లులేక పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఇళ్లను కేటాయించి ప్రొసీడింగ్ పత్రాలు అందించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో లబ్దిదారుల సమక్షంలో డ్రాతీసి ఇళ్లను కేటాయించారు. అనేక రోజులుగా ఇంటికోసం ఎదురుచూశామని, తమ కల నెరవేరిందని పేర్కొన్నారు.

### ఇంటి ఇబ్బందులు తీరాయి..

**- గోనెపెల్లి అనూష, అనంతారం**



అనేక సంవత్సరాలుగా అందరం కలిసి ఒకే ఇంటిలో నివసిస్తూ ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వం ఇందిరమ్మ పథకం క్రింద ఇంటిని మంజూరు చేయడంతో స్వంతస్థలంలో ఇంటి నిర్మాణం పూర్తిచేశాం. విడతల వారిగా ఖాతాలో డబ్బులు జమచేసింది. స్వంత ఇంటి కల తీరదు అనుకున్నాం కానీ ప్రభుత్వ నిర్ణయం వల్ల కల నెరవేరింది.

### సొంతింటి కల తీర్చాలన్నదే ప్రభుత్వ సంకల్పం

**- కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే**



నిరుపేద ప్రజల స్వంతింటి కల తీర్చాలన్నదే ప్రభుత్వ సంకల్పం. కేంద్రప్రభుత్వంతో కొట్లాడి ఎక్కువ ఇళ్ళను రాష్ట్రానికి తీసుకవచ్చిన ఘనత సీఎంకు దక్కుతుంది. నియోజకవర్గానికి 3500 ఇళ్ళు మంజూరు అయ్యాయి. మరో నెలరోజులలో అనేక గ్రామాలలో గృహప్రవేశాలు జరుగనున్నాయి. లబ్దిదారులు పనులు వేగవంతంగా పూర్తిచేయాలి.

# మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

### - మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ



అన్నపూర్ణ రిజర్వాయర్‌లో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో శనివారం చేపపిల్లలను వదిలిపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చేపపిల్లల బాధ్యత కాంట్రాక్టర్లకు అప్పగించేవారని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల మధ్యవర్తులు లాభపడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం మత్స్యశాఖ అధికారులతో కలిసి చేపపిల్లలను వదులుతున్నట్లు పేర్కొన్నారు. చేపల చెరువులను దళారులకు అప్పగించకుండా మత్స్యకారులే చేపలుపట్టి లాభపడాలని సూచించారు. రాష్ట్రప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలు లబ్దిపొందుతున్నారని పేర్కొన్నారు. నిరుపేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, జిల్లా డైరెక్టర్ పర్శరాం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, మండల శాఖ అధ్యక్షుడు ఎలవేని రాజు, మాజీ ప్యాక్స్‌చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ముత్యాలపోచమ్మ దేవస్థాన అధ్యక్షుడు అంతగిరి, మాజీ ఎంపీపీ అయిలయ్య, పసుల వెంకటి, రజనీకాంత్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ

మండలంలోని వివిద గ్రామాలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతగిరి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, రేపాకలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, అనంతారం, ముస్కానిపేట, కందికట్కూర్ గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలకు భూమిపూజలు చేశారు. కార్యక్రమంలో రమణారెడ్డి, పసుల వెంకటి, చిట్టి ఆనందరెడ్డి, తీగల పుష్పలత, మామిడి రాజు, వెలిచాల జ్యోతి, మామిడి సంజీవ్, ఖాత మల్లేశం, సాగర్, గూడ బాబులతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలను పరామర్శించిన విప్

రుద్రంగి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను శనివారం రాత్రి ప్రభుత్వ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, కేసిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, సూర యాదయ్య, ఎర్రం అరవింద్, పోగుల మహేష్, తదితరులు పాల్గొన్నారు

### మృతుల కుటుంబాలకు చేయూత

కోనరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లిమక్తలో మృతిచెందిన కుటుంబాలకు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో చేయూతనందించారు. పల్లిమక్తకు చెందిన అనుపాటి లింగారెడ్డి, ఎల్లయ్య మృతిచెందగా ఆయా కుటుంబాలకు 50కిలోల బియ్యాన్ని కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, లచ్చిరెడ్డి, ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, జాగిరి శంకర్, రాజు, అంజిరెడ్డి ఉన్నారు.

### పోడు భూములపై గ్రామస్థులకు అవగాహన

కోనరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మరిమడ్లలో గ్రామీణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు తాటిపాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోడు భూములపై అవగాహన కల్పించారు. గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటుచేసి ఆయా సమస్యలపై పోడు భూములపై చర్చ గోష్టి నిర్వహించి సూచనలు చేశారు. జింక సుధాకర్, రాజయ్య, కుమ్మరి దిలీప్, అక్కపెల్లి శంకరయ్య, అనిల్, మైసమ్మ, దేవమ్మ, కొమ్ము భీమాశంకరి పాల్గొన్నారు.

### పాడి రైతుకు ఆర్థిక సాయం అందజేత

కోనరావుపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని నిమ్మపల్లికి చెందిన కూస రాంరెడ్డి అనే రైతు పాడి గేదెలు విద్యుదాఘాతంతో మృతిచెందగా ఆ రైతుకు భరోసాగా సెస్ సంస్థ ద్వారా 80వేల చెక్కును సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి అందజేశారు. అమరం భాస్కర్ రెడ్డి, చెంచు రాంరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, లైన్‌మన్ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీ నేతల సంబరాలు

కోనరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీహార్‌లో గెలుపుపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్కార్ బాలాజీ, బైరగొని సురేష్ గౌడ్, చీకటి మధు, పాలకుర్తి శ్రీనివాస్, వేల్పుల తిరుపతి, జలందర్, ముష్టం శ్రీనివాస్, దిలీప్, సాయికృష్ణ తిరుపతి, మైపాల్, విజయ్, పర్శరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట) : వీర్నపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. లక్‌పతి, ప్రభాకర్, నాగరాజు, పీర్యానాయక్, మహేశ్, రమేశ్, కృష్ణ, తిరుపతి, రజనీకాంత్, వెంకటేశ్, దర్‌సింగ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుల సంబరాలు

చందుర్తి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ గెలుపుపై రామన్నపేటలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భీమరాజ్ కనకరాజు ఆధ్వర్యంలో శనివారం సంబరాలు జరుపుకున్నారు. పత్తిపాక రాజయ్య, ముదిగం పెల్లి బుచ్చి రాములు, దుమ్మ నర్సయ్య, మెరుగు అరుణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

### లింగాపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ ప్రారంభం

గంభీరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సముద్రలింగాపూర్‌లో వ్యవసాయానికి సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం సెస్ డైరెక్టర్ నారాయణరావు ప్రారంభించారు. రూ.లక్షా 70వేలతో ఇంప్రూమెంట్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్టు నారాయణరావు తెలిపారు. ఏఈ ఆనంద్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ అమరేందర్, రైతులు ఉన్నారు.

### వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో వినోద్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పదో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి డీఈవో వినోద్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం, తదితర రికార్డులు, మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు రుచికరమైన భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల ప్రగతిపై ఆరాతీశారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. విషయాల వారిగా విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జి డీఈవో వినోద్ అన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం చంద్రశేఖర్ ఉన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన కొమ్మురాజుల తిరుపతి మృతిచెందగా, కుటుంబీకులకు శనివారం ఆర్థిక సహాయం అందించారు. తిరుపతి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న కేతిరెడ్డి స్వప్ననవీన్‌రెడ్డి రూ.5వేల నగదుతో పాటు 50కిలోల బియ్యం, 5కిలోల నూనెను అందజేశారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేదలకు వైద్యపరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా 10 సంవత్సరాలలో రూ. 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వ ఏర్పడిన నాటినుంచి నేటి వరకు రూ. 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, నాయకులు సంద్రగిరి శ్రీనివాస్, వకులాభరణం శ్రీనివాస్, గూడూరి మధు, రంగు వెంకటేశ్, చిలుక రమేష్, పీర్‌మహ్మద్, పుల్కం రాజు, నాగుల విష్ణుప్రసాద్ తదితరులు ఉన్నారు.

# మాలలను అన్ని రంగాల్లో అణచివేసే ప్రయత్నాలు

### - మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య

సిరిసిల్ల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ వాదులైన మాలలను అన్ని రంగాలలో కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేసే ప్రయత్నం చేస్తుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో మాలల రణభేరి మహాసభ కరపత్రాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య, నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య విలేకరులతో మాట్లాడారు. దేశంలో మనువాద పార్టీలు దళితులను విభజించి ఐక్యతను చీల్చి రాజ్యాధికారానికి దూరం చేసూ కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. షెడ్యూల్ కులాలలో వెనుకబాటుకు గురైన కుటుంబాలకు విద్యా, ఉద్యోగాలలో అవకాశాలను కల్పించేందుకు సరైన డేటా తీసుకొని వెనకబాటుకు గురైన వారికి న్యాయం చేయాలని సుప్రీం కోర్టు సూచించిందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ సూచనలను పాటించకుండా ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి మాలలతో పాటు మరో 25 అనుబంధ కులాలను గ్రూప్-3గా నిర్ణయించి ఐదు శాతం రిజర్వేషన్‌లకు మాలలను పరిమితం చేయడం అన్యాయమన్నారు. ఈనెల 23న మాల మహానాడు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకేశ్వర్లు, జాతీయ కార్యదర్శి రాగుల రాములు, జిల్లా నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



సిరిసిల్లలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

### బీడీ పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

చందుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీడీ పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు కడారి రాములు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆల్ ఇండియా బీడీ, సిగార్, టొబాకో వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) అనుబంధం ఆధ్వర్యంలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29, 30 తేదీల్లో జరిగే జాతీయ కౌన్సిల్ సభ, సమవేశం వేములవాడలో జరుగుతుం దన్నారు. బీడీ పరిశ్రమలోని సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ బీడీ ఫెడరేషన్ 1965లో ఏర్పడిందన్నారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ. 300 ఇవ్వాలన్నారు. కార్మికులకు నెలలో రోజులు పని కల్పించాలని, సంక్షేమ దవాఖానా ద్వారా పథకాలు అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనసూర్య, కౌన్సిల్ సభ్యులు అజ్జ వేణు, దర్శనాల లత, ఎడ్ల విజయ, అక్కునూరి శరవ్వ తదితరులు పాల్గొన్నారు.

### పాదయాత్రను విజయవంతం చేయాలి

గంభీరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18న సిరిసిల్లలో నిర్వహించే బారీ పాతయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్యక్రమ ఇన్‌చార్జీలు ఆడెపు రవీందర్, గూడూరు భాస్కర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈనెల 19న హుజురాబాద్‌లో నిర్వహించే సమావేశానికి ప్రతి బూత్ నుంచి బూత్ అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి, సోషల్ మీడియా కన్వీనర్లు తప్పకుండా హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వాజీద్‌హుస్సేన్, మండల ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, ఉపాధ్యక్షులు మోహన్, నర్సింలు, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు నాగరాజు, దుర్గేష్, స్వామి, అంజనేయులు, సర్వోత్తమ్, రవీందర్, శ్రీనివాస్, ప్రసాద్, దేవేందర్, చంద్రం, రాజిరెడ్డి, లింగం, రాజు తదితరులు ఉన్నారు.

# ఘనంగా బాలల దినోత్సవం



తంగళ్లపల్లి సరస్వతి పాఠశాలలో విద్యార్థుల వేషధారణ





సిరిసిల్ల సెలెస్టియల్ పాఠశాలలో విద్యార్థినుల నృత్యాలు

తంగళ్లపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సరస్వతి శుభోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండేపల్లిలో సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్వయం పరిపాలన వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కొక్కుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : జిల్లా కేంద్రంలోని సెలెస్టియల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం బాలల దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ బుర్ర రాధాకృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ మచ్చ ఇందిర, వైస్ ప్రిన్సిపల్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వేములవాడ : పట్టణంలోని గౌతమ్ మోడల్‌స్కూల్‌లో రెండు రోజులపాటు బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మాంచారు. కరస్పాండెంట్ బూర ఉమారమేష్, ప్రిన్సిపల్ హరికిషన్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.





వేములవాడ గౌతమ్ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు

### కేజీబీవీని సందర్శించిన వైద్య సిబ్బంది

బోయినపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. తర్వాత పిల్లలకు ఓరల్ హెల్త్ చలికాలంలో వచ్చే అస్తమా, ఎలర్జీకి సంబంధించిన వ్యాధులపై రక్తహీనతపై అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్‌ను సందర్శించి పిల్లలకు పరిశుభ్రమైన, వేడి ఆహారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని వార్డెన్‌కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఆర్.కార్తీక్, సూపర్‌వైజర్లు టి.హేమలత, అశోక్, ఇంచార్జ్ ఎస్.ఓ సంగీత, సబ్ సెంటర్ ఆరోగ్య కార్యకర్త ఉషాదేవి, స్కూల్ ఆరోగ్య కార్యకర్త ప్రసన్న, ఆశా కార్యకర్త సరళ తదితరులు పాల్గొన్నారు.

### మురుగు నీటి కాల్వ నిర్మాణ పనుల వద్ద ఆందోళన



పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన మురుగు నీటి కాల్వ నిర్మాణ పనులను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ఎస్సీ కాలనీ సమీపంలో శనివారం స్థానికులు ఆందోళనకు దిగారు. గ్రామంలో రహదారి మధ్య నుంచి 33 ఫీట్లను వదిలి పనులను చేయకుండా అధికారులు ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. స్థలం యజమానులతో అధికారులు కుమ్మకై పనులను చేపడుతున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోకుండా పనులు చేయడంలో అంతర్యమేమిటోనని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, భీమేశ్వర్, సతీష్, పద్మారెడ్డి, శ్రీనివాస్, దేవయ్య, లక్ష్మణ్, భాను, చంద్రయ్య, రమేశ్, నారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య శనివారం పరామర్శించారు. మండల కేంద్రంలోని పెద్దమల్ల రాములు, రాచర్లగొల్లపల్లిలో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి తల్లి ఇటీవల మరణించారు. ఆ కుటుంబాలను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు సందీప్, పర్శరాములు, రామచంద్రం, శ్రీనివాస్, రవి, సురేశ్, అంజనేయులు, దేవరెడ్డి తదితరులు ఉన్నారు.

### బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశాలను ఆ పార్టీ నాయకులు శనివారం నిర్వహించారు. ఈనెల 19న హుజురాబాద్‌లో నిర్వహించనున్న బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో నాయకులు సంతోష్, గణేశ్, లక్‌పతి, ప్రభాకర్, బాలకృష్ణ, శ్రీనివాస్, గణేశ్‌నాయక్, కిరణ్‌నాయక్, లహరి, మహేశ్, ప్రదీప్, చందు, సాగర్, నాగరాజు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ కౌన్సిల్ సమావేశ కరపత్ర ఆవిష్కరణ

రుద్రంగి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని దేశ బీడీ కంపెనీ బ్రాంచ్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 29,30 నిర్వహించే జాతీయ కౌన్సిల్ సమావేశ కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనసూర్య, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, తదితరులు పాల్గొన్నారు

### కేటీఆర్ రాజకీయ సన్యాసం తీసుకుంటారా?

**- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి**

సిరిసిల్ల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు రెఫరండం అన్న కేటీఆర్ రాజకీయ సన్యాసం తీసుకుంటారా...? అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గం నుంచి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాలు పంచుకొని కాంగ్రెస్ అభ్యర్థి విజయంలో పాలుపంచుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికలను తాము ముందు ఊహించిందేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో, నాడు కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన దక్షతకు నిదర్శనం అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, కాసర్ల రాజు, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, యెల్లె లక్ష్మీనారాయణ, వెంగళ లక్ష్మీనర్సయ్య, వేముల రవి, రెడ్యానాయక్, కమలాకర్‌రావు, బైరినేని రాము, రోజా, చందన, యాదగిరి పాల్గొన్నారు.